విశాలాంధ్ర
చిత్తూరు జిల్లా

చంద్రబాబు రిమాండ్‌తో పోలీసులు అప్రమత్తం

విశాలాంధ్ర - వి. కోట: మాజి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను సర్కిల్ డెవలప్ మెంట్ కేసులో ఏసిబి కోర్టు రిమాండ్ కు తరలింపు తీర్పు ఇవ్వడంతో మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు 144 సి ఆర్పీసి అమలు చేశారు. స్థానిక ఎన్టిఆర్ సర్కిల్ గుమికూడిన ఆ పార్టీ నాయకులను పంపించి వేశారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ నుండి వైఎస్సార్ సర్కిల్ వరకు ప్రజలు ఎక్కడా గుంపులుగా ఉండకూడదని మైకుల ద్వారా అనౌన్స్ చేశారు. సి. ఐ. లింగప్ప, ఎస్సై మనోహర్, ఏఎస్సై జయకృష్ణ సిబ్బంది మండల కేంద్రంలో ని ప్రధాన రహదారిపై గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కక్ష సాధింపు తోనే చంద్రబాబును అరెస్టు చేశారు
టిడిపి మహిళా నేత విజయ్ కుమారి

విశాలాంధ్ర-పుంగనూరు: తెలుగుదేశం రాష్ట్ర పార్టీ అధ్యక్షులు కింజారపు అచ్చం నాయుడు ఆదేశాల మేరకు పుంగనూరు టిడిపి మహిళా నేత జి విజయ్ కుమారి పార్టీ నాయకులతో కలిసి పట్టణంలో చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ దీక్ష చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా జి. విజయ్ కుమారి మాట్లాడుతూ వైయస్సార్ పార్టీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రావడం వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పైన కక్ష సాధింపు కేసులు పెట్టి ఇబ్బంది పెట్టడం జరిగిందన్నారు. మొన్నటికి మొన్న పుంగనూరు అల్లర్ల కేసులో దాదాపు 480 మంది అమాయకులైన టిడిపి కార్యకర్తలపై కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరిగిందన్నారు. దీనివలన వారి కుటుంబాలంతా తీవ్ర ఇబ్బంది పడుతున్నారు అన్నారు. అదే రీతిలో ఉమ్మడి రాష్ట్రంలో 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా 14 సంవత్సరాలు ప్రతిపక్ష నేతగా రాష్ట్రానికి సేవలు అందించిన నారా చంద్రబాబు నాయుడు పై ఎలాంటి ఆధారాలు లేకుండా గవర్నర్ అనుమతులు లేకుండా కక్షపూరితంగా మా నాయకుడికి ఆధారాలు చూపకుండా అరెస్టు చేయడం జరిగిందన్నారు. పోలీసులు వైసిపి కార్యకర్తలు లాగా పని చేస్తున్నారు తప్ప రాజ్యాంగబద్ధంగా యూనిఫామ్ వేసుకుని రాజ్యాంగాన్ని లెక్కచేయకుండా ఇష్టం వచ్చినట్లు రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఇలాంటి వ్యక్తులకు రాబోయే రోజుల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పడం జరుగుతుందని హెచ్చరించారు. నారా చంద్రబాబు నాయుడు ఏ తప్పు చేయలేదు కాబట్టి బెయిల్ పై విడుదల కావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు కే మునిరెడ్డి, వెంకటప్ప సిద్దప్ప,జి కదిరప్ప, డి శ్రీనివాసులు, వి కృష్ణప్ప, జి నారాయణప్ప, ఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

విశాలాంధ్ర -పులిచెర్ల-కల్లూరు: పులిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం1979-1980 సంవత్సరం 10వ తరగతి విద్యార్థులసమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలలో అలనాటి విషయాలను తీపి గుర్తులను ఉపాధ్యాయుల బోధన మందలింపులను గుర్తు చేసుకున్నారు. ఒకరికి ఒకరు పరిచయం చేసుకుంటూ ప్రస్తుత జీవనం గురించి తెలుసుకున్నారు. అప్పటి గురువులు అయిన ఉపాధ్యాయులు నాగిరెడ్డి గిరిజాలను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం
సోకసంద్రంగా మారిన కొల్లాగుంట దళితవాడ

విశాలాంధ్ర-కార్వేటినగరం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మండల పరిధిలోని .. కొల్లగుంట గ్రామ సమీపంలో పడిపేటమ్మ ఆలయం వద్ద చిత్తూరు- పుత్తూరు జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. ఎస్.ఐ దస్తగిరి కథనం మేరకు వివరాలిలా...కొల్లా గుంట గ్రామానికి చెందిన రాజ(51) అదే గ్రామానికి చెందిన తమ సమీప బంధువు చంద్రతో కలసి టీవీఎస్ స్కూటర్పై ఇంటి నుంచి తమ సిమెంట్ బ్రిగ్స్ ఫ్యాక్టరీ వద్దకు వెళుతున్న తరుణంలో నగరి నుంచి చిత్తూరుకు వెళ్లుతున్న ఏపీ 03 హెచ్ 4456 హోండా కారు అతివేగంగా దూసుకొచ్చి స్కూటర్ పై వెళుతున్న వారిని పడివేటమ్మ ఆలయం వద్ద ఢీ కొనడంతో స్కూటర్ నడుపుతున్న రాజాను సుమారు వంద అడుగుల దూరం వరకు లాకెళ్లడంతో రాజ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే 'మృతి చెందాడు. అలాగే ఎదురుగా ద్విచక్రవాహనంపై వస్తున్న బెంగళూరుకు చెందిన భరత్ కుమార్ ఢీకొనందంతో అతనికీ కాలుకు తీవ్రగాయాలైందని ఎస్.ఐ తెలిపారు. దీంతో రాజు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఉన్నతికి తరలించి,అలాగే తీవ్రంగా గాయపడిన బాబును కూడా చికిత్స నిమిత్తం పుత్తూరు: ప్రభుత్వ ఆస్పత్రికి 108 వాహనం ద్వారా తరలించామన్నారు. కారు డ్రైవర్ నగర మండలం సంక్రాంకవ్వం పంచాయతీ సోమనాథపురం గ్రామానికి చెందిన శేఖర్ కుమారుడు హరి గా గుర్తించినట్లు తెలిపారు. మృతికి భార్య మీనా ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ దస్తగిరి పేర్కొన్నారు.

-శోకసంద్రంగా మారిన కొల్లాగుంట దళితవాడ

కొల్లాగుంట దళితవాడకు చెందిన రాజ చాలా పేద కుటుంబానికి చెందిన వాడు. ఆయనకు 5 మంది ఆడ పిల్లలు వారిలో ఒక్కరికి మారతమే వివాహం చేశాడు. మిగిలిన పిల్లలు చదువుకుంటున్నారు. జీవనాదారం కోసం అప్పు చేసి సిమెంట్ బ్రిగ్స్ తయారీ పెట్టుకొన్ని పిల్లలను పోషిస్తున్న సమయంలో విధి వక్రీకరించి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో భార్య, 5 మంది పిల్లలు గుండెలవిసేలా విలపించడం చూసి కంటి తడిపెట్టనివారులేరు. దీంతో ఆ గ్రామం సోక సంద్రంగా మారింది.

శాసనాల ద్వారా శ్రీవారి వైభవాన్ని చాటిన శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి
- టీటీడీ చైర్మన్‌భూమన కరుణాకర్ రెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి: తిరుమల శ్రీవారి ఆలయంలోని శాసనాలను అనువదించి ఆలయ చరిత్రను, శ్రీ వేంకటేశ్వరస్వామివారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి అని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి అన్నారు . శ్రీవారి ఆలయం ఉన్నంతవరకు ఆయన చిరంజీవిగా నిలుస్తారన్నారు. తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో ఆదివారం జరిగిన శ్రీ సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి 42వ వర్ధంతి సభకు చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ కరుణాకర రెడ్డి ఉపన్యసిస్తూ, టీటీడీలో చిన్న స్థాయి ఉద్యోగిగా ఉంటూ వెయ్యికి పైగా శాసనాలను వెలికితీసి పరిష్కరించిన గొప్ప వ్యక్తి సుబ్రహ్మణ్య శాస్త్రి అని చెప్పారు. అన్నమయ్య రచించిన 32 వేల సంకీర్తనల్లో 12 వేల సంకీర్తనలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇందులో అధిక భాగం సంకీర్తనలను శ్రీ శాస్త్రి పరిష్కరించి సమాజానికి అందించినట్లు ఆయన వివరించారు. అలాంటి మహానుభావునితో పాఠశాల చదివే రోజుల్లోనే పరిచయం కావడం తన అదృష్టమని ఆయన తెలిపారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అమూల్యమైన సేవలందించిన శ్రీ సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి, శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి, శ్రీ రాళ్ళ పల్లి అనంత కృష్ణ శర్మ విగ్రహాలు ప్రతిష్టించాలనే ఆలోచన శ్రీ వేంకటేశ్వర స్వామి వారే తనకు కల్పించారన్నారు. ఇలాంటి మహానుభావుల జీవితాలను, వారు చేసిన కృషిని విద్యార్థులు తప్పని సరిగా తెలుసుకోవాలని చైర్మన్ పిలుపు నిచ్చారు. వీరి సేవలు తెలుసుకుని సమాజానికి ఉపయోగపడే వారిలా మారితేనే చదువుకు సార్థకత లభిస్తుందని ఆయన చెప్పారు. శ్రీ సాధు సుబ్రమణ్య శాస్త్రి వెలికి తీసి పరిష్కరించిన శాసనాల పుస్తకాలను పిల్లలు, పెద్దలు కూడా చదవాలని పిలుపునిచ్చారు. ఆచార్య శ్రీ రామ సూర్యనారాయణ "శ్రీ సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి యోగ దానం" అనే అంశంపై, ప్రముఖ శాసన పరిశోధకులు ఆచార్య శ్రీ కృష్ణారెడ్డి "శ్రీ సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి పరిశోధన దీక్ష" అనే అంశంపై ఉపన్యసించారు.శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి 42వ వర్ధంతి సందర్భంగా తిరుపతిలోని శ్వేత భవనం ఎదురుగా గల ఆయన విగ్రహానికి చైర్మన్ శ్రీ కరుణాకర రెడ్డి పుష్పాంజలి ఘటించారు.

శ్రీ గౌరి పెద్ది రామసుబ్బ శర్మ విగ్రహావిష్కరణ

ఎస్వీ ఓరియంటల్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన శ్రీ గౌరి పెద్ది రామసుబ్బశర్మ విగ్రహాన్ని చైర్మన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేఈవో సదా భార్గవి, శాస్త్రి కూతురు గిరిజ, మనుమడు, జడ్జి మూర్తి, శ్వేత సంచాలకులు ప్రశాంతి, అన్నమాచార్య ప్రాజెక్ట్ సంచాలకులు విభీషణ శర్మ పాల్గొన్నారు.

విశ్వసనీయత నమ్మకానికి పెద్దపీట:ఎమ్మెల్యే బియ్యపు
వైసిపి యువజన విభాగం అధ్యక్షుడిగా తలపా దామోదర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : విశ్వసనీయతకు, నమ్మకానికి, నిజాయితీకి నేను మొదటి స్థానం ఇస్తానని.. అలాంటి వారు ఎక్కడా ఉన్న కులం, మతం, ఆర్థిక స్థోమత చూడకుండా వారిని పిలిచి పదవులు ఇస్తానని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి శ్రీకాళహస్తి పట్టణంలోని శరవణ ఫంక్షన్ హాల్లో ఆదివారం శ్రీకాళహస్తి వైఎస్ఆర్సీపీ యువజన విభాగం అధ్యక్షుడుగా నియమితులైన తలపా దామోదర్‌రెడ్డి ప్రమాణ స్వీకార అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ విశ్వసనీయతకు, నమ్మకానికి, నిజాయితీకి నేను మొదటి స్థానం ఇస్తానని.. అలాంటి వారు ఎక్కడా ఉన్న కులం, మతం, ఆర్థిక స్థోమత చూడకుండా వారిని పిలిచి పదవులు ఇస్తానని అన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అనేక మంది బీసీలకు సముచిత స్థానం కల్పించామన్నారు. సిపాయి సుబ్రహ్మణ్యం వేరేపార్టీలో ఉన్నా ఆయన నిజాయితీకి మెచ్చి ఎమ్మెల్సీ కావడాని అన్ని విధాలుగా ఆయనకు సహకరించామన్నారు. ఆదే విధంగా మార్కెట్ యార్డు చైర్మన్ గా మధురెడ్డి, నేడు వైఎస్ఆర్ యువత అధ్యక్షుడుగా దామోదర్ రెడ్డికి అవకాశం కల్పించామన్నారు. నాయకుడు అయిన వారు తప్పకుండా ప్రజాసేవ చేయాలని... పదవులు తీసుకుని ఇంట్లో కూర్చుంటే దానికి విలువ ఉండదన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత నేను, నా కుటంబ సభ్యులు కరోనా కష్టకాలంలో కూడా ప్రజలకు భరోసా కల్పించామన్నారు..అందుకే ఈ నాడు చినన సమస్య వచ్చినా నా కార్యాలయం ఇంటి వస్తున్నారని ప్రజలక భరోసా కల్పించేందుకే నిత్యం ప్రజల్లో ఉంటున్నామన్నారు. ఏదైనా రోగంవచ్చినపుడు ప్రజలు మంచి వైద్యుని వద్దకు ఎంత దూరమైన వెళుతారో.. నేడు ఆ విధంగా శ్రీకాళహస్తి ప్రజలు నా వద్దకు వస్తున్నారన్నారు. ప్రజలు ఇచ్చిన గొప్ప అవకాశాన్ని ప్రజాసేవలో గడుపుతున్నామన్నారు. 447 మందికి ఉచితంగా విద్యాదానం, 160 మందిని నా బిడ్డ పవిత్రారెడ్డి దత్తత తీసుకుని వారికి అన్ని విధాలుగా తోడ్పతున్నారన్నారు. ముస్లింలు నేడు పెళ్లి చేసుకోవాలంటే కట్నంగా బీరువా, మంచం, టీవీ ముందుగా ఇస్తానని ధైర్యంగాచెబుతున్నారన్నారు. అది వారికి నేను ఇచ్చిన బరోసా అని అన్నారు. పేదవారు మరణిస్తే ఎట్టువంటి ఇబ్బందులువుండ కలహాలతో ఒకనికి ఒకరు గొడవ పడేవారన్నారు. అయితే తాను పేదవారికి రూ.10వేలు ఇచ్చి సాయం చేస్తునానన్నారు. గత పాలకులు బొజ్జల కుటుంబం గత 30 సంవత్సరాలుగా బ్రిటీష్ వారిలాగా ఇక్కడ సంపాదించి న డబ్బుతో హైదరాబాద్ ఆస్తులు కూడబెట్టుకున్నారన్నారు. నేను బెంగళూరులో సంపాదించి శ్రీకాళహస్తి ప్రజలకు సాయం చేస్తున్నానన్నారు. తెలుగుదేశంలో కూడా కొంతమంది నాయకులు, కార్యకర్తలు మధన్నతో ఉండే వారు బాగుపడ్డారని తాము అప్పుల పాలయామని చెప్పుకుంటున్నారన్నారు. నేడు నిజాయితీ పరులైన దాము. సిపాయి సుబ్రహ్మణ్యం, కావచ్చు వెతికి అవకాశం. ఇచ్చామన్నారు. నిబద్ధతతో పనిచేస్తే ఇంకా ఉన్నత పదవులు దక్కుతాయన్నారు. కొంతమంది పదవులు తీసుకుని వెన్నుపోటు పొడవాలని చూస్తున్నారని సమయం వచ్చినపుడు వారికి బుద్ధి చెబుతామన్నారు. అనంతరం సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మధన్న ఎంతో నమ్మకంతో తనకు, దమోదర్రెడ్డి, మధురెడ్డికి అవకాశాలు ఇచ్చారన్నారు. వన్నెకుల క్షత్రియులు ఆయనకు అండగా ఉండాలన్నారు. గత 30 సంవత్సరాల్లో ఎన్నడూ లేనివిధంగా వన్నెకుల క్షత్రియులకు పదవులు, వచ్చాయన్నారు. మదన్న గెలుపు శాయశక్తులా ప్రయత్నించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో మన స త్తా చాటాలన్నారు. తాను ఎపుడు ఎమ్మెల్యే రుణపడి ఉంటామన్నారు. పది సంవత్సరాలు టీడీపీలో పనిచేస్తే బీసీ అయిన నన్ను వాడుకుని వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు మధన్న బీసీలకు ఎంతో సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. ఆయన సేవా కార్యక్రమాలు శ్రీకాళహస్తికి ఇలాంటి నాయకుడు మరో 20 సంవత్సరాలు అవసరమని భావిస్తునామన్నారు. వైఎస్ఆర్సిపి యువజన విభాగం శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబంలో వచ్చిన నాకు ఉన్నత స్థానం ఇచ్చారని. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి బ్రతికున్నంత వరకు విశ్వాసపాత్రుడుగా ఉంటూ ఆయన ఆదేశాలను పాటిస్తూ ముందుకెళ్తానన్నారు. అంతేకాకుండా బీసీలకు సంస్థ స్థానం ఇచ్చిన ఏకైక నాయకుడు మాదన్న అని కొనియాడారు. అనంతరం వన్నెకుల క్షత్రియ పెద్దలు అయిన వెంకటరెడ్డి. రత్నంరెడ్డి, కిట్టు మేస్త్రీ, మునిరత్నం, యానాది రెడ్డి, బుజ్జిరెడ్డిని సన్మానించారు. ప్రజా సేవలో మదన్న అనే సిడిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి బాలకృష్ణ, పగడాల రాజు, లోకేష్ యాదవ్. జయగోపాల్, వడ్లతాంగల్బాలాజీ ప్రసాద్ రెడ్డి, వక్స్ బోర్డు చైర్మన్ సిరాజ్, ముత్యాల పార్థసారథి, సుమతి, ప్రమీలమ్మ, కంఠా ఉదయ్, ఫజల్, గరికపాటి చంద్ర, చుక్కల కిరణ్, నాని, జయరామ్ యాదవ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ధర్మమే గెలుస్తుంది
చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటికి వస్తాడు

విశాలాంధ్ర పుత్తూరు టౌన్: పుత్తూరు పట్టణ ప్రాంతంలోని ఆదివారం సాయంత్రం చిత్తూరు జిల్లా పార్లమెంటు సభ్యుడు బిసి సెల్ అధ్యక్షుడు షణ్ముఖ రెడ్డి విలేకరి సమావేశంలో మాట్లాడుతూ ఒక ఫ్యాక్షనిస్టైన పాలకుడు..కిరాయి రౌడీలుగా మారిన పోలీసులు అల్లిన కల్పిత కథే స్కిల్ డెవలప్మెంట్ కేసుచిత్తూర్ పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగ రెడ్డిస్కిల్ డెవలప్మెంట్ అంశానికి సంబంధించి ఎంఓయూ చేసుకున్నది అప్పటి ఆ కార్పొరేషన్ ఎండీ ప్రేమ్ చంద్రారెడ్డి నిధులు విడుదల చేసింది అప్పటి ఫైనాన్స్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజేయ్ కల్లాం ప్రస్తుతం వీరిద్దరూ సీఎం జగన్ రెడ్డికి సలహాదారులు వారిద్దరినీ కనీసం విచారించకుండా, నిందితులుగా చేర్చకుండా ఇక కేసు ఎక్కడిదిబీఆర్ కృష్ణారావు నోట్ ఫైల్ తయార్ చేశారని చెబుతున్నప్పుడు ఆయన్ని కనీసం ప్రశ్నించలేదు. గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలు కూడా అదే కంపెనీతో అదే పద్ధతిలో ఎంఓయూ చేసుకుని, అదే విధానంలో నిధులు విడుదల చేశాయి.ఆ రాష్ట్రాల్లో ఎక్కడా లేని ఆరోపణలను ఇక్కడే తెచ్చారు. ఈ క్రమంలో అది స్కామో, కాదో తేల్చాల్సింది న్యాయస్థానం ఏ అగ్రిమెంటు మీదా, ఏ ఫైలు మీదా సంతకం చేయని అప్పటి సీఎం చంద్రబాబునాయుడిని నిందితుడిగా చేర్చడం కేవలం రాజకీయ కక్షసాధింపే అది కేబినెట్ తీర్మానం...అది కేబినెట్ ఉమ్మడి నిర్ణయం...అందులో ముఖ్యమంత్రిని ఎలా దోషిగా నిలబెడతారు ఒక ఫ్యాక్షనిస్టు పాలకుడిగా, పోలీసులు కిరాయి రౌడీలుగా మారిన చోట చట్టం, న్యాయం ఏముంటుంది రాష్ట్రమంతా తెలుగుదేశం పార్టీ నాయకులు సంబరాలు జరుపుకుంటూ అదే విధంగా ఎలాంటి మచ్చ లేకుండా ఆయన ధర్మమే గెలుస్తుందని నాయకులు ఆనందంతో వ్యక్తపరిచారు ఈ కార్యక్రమంలో సీనియర్ తెలుగు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

వినాయకుని సేవలో ప్రముఖులు

విశాలాంధ్ర-ఐరాల : స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి దర్శనార్థం మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు, ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావు, చిత్తూరు ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులు, స్వామివారి ప్రధాన ఆలయ పునర్నిర్మాణ దాతలు ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్ కుటుంబ సభ్యులు కాణిపాకం విచ్చేశారు. వారిని ఆలయ చైర్మన్ ఏ. మోహన్ రెడ్డి, ఆలయ ఈవో వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులచే ఆశీర్వచనం, స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎస్ వి కృష్ణారెడ్డి, పర్యవేక్షకులు కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం

విశాలాంధ్ర-పలమనేరు: రాష్ట్రంలో ఉన్న 13 లక్షల మంది ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్లు సమస్యలు పరిష్కారం కావాలంటే ఐక్య ఉద్యమాల ద్వారానే సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. గురు రాజారావు అభిప్రాయపడ్డారు.స్థానికఎన్జీవో హోమ్ లో జరిగిన రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వి గురు రాజారావు మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగు జేఏసి నాయకత్వాలు ఒక తాటిపై ఐక్య ఉద్యమాలకు పిలుపు ఇవ్వాలని అందుకు సంబం ధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. గత 7 దశాబ్దాలుగాఐక్య ఉద్యమాల ద్వారానే 10 వేతన సవరణ స్కేలు సాధించామని కానీ ఐక్య ఉద్యమాలు లేని కారణంగా 11వ వేతన సవరణ స్కేలలో సౌలభ్యాలు సాధించడంలో ఘోరంగా నష్టపోయామన్నారు. అందుకు ఉదాహరణగా జూలై 2018 జనవరి 2019 జూలై 2019 నాటి నుండి డిఆర్ బకాయిలు ఈనాటికీ పొందలేకపోతున్నామన్నారు. దానికి తోడు ఏప్రిల్ 2020 నుండి డిసెంబర్ 2021 వరకు ప్రభుత్వం చెల్లించాల్సిన పీ ఆర్ సి బకాయిలు ఈనాటికీ చెల్లించ లేదన్నారు. ఈ కార్యక్రమంలో గౌస్, బాలసుబ్రమణ్యం, వీరభద్ర గౌడ్,నరసింహులు, మస్తాన్,మోహన్, గోవిందయ్య,భాస్కర్,మాలతి, నాగభూషణం, సైలా కుమారి, అక్బర్ బాషా, నిజాం సాహెబ్, చక్రపాణి శెట్టి, కృష్ణమ్మ, విజయలక్ష్మి, గురు స్వామి నాయుడు, జగదీష్, రాజారెడ్డి, సాంబయ్య, వినాయక, మురళీధర్ చెన్నప్ప, జయ రామ్, పురుషోత్తం రావు పాల్గొన్నారు.

స్వర్ణప్రాశన ఔషధంతో జ్ఞాపకశక్తి పెంపుదల
- టీటీడీ జేఈవో సదా భార్గవి

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: స్వర్ణప్రాశన ఔషధంతో పిల్లల్లో జ్ఞాపకశక్తి, రోగనిరోధక శక్తి, మేధస్సు, జీర్ణశక్తితో పాటు ఆయుష్షు పెరుగుతుందని ఆయుర్వేద గ్రంధాలలో ఉన్నట్లు జేఈవో సదా భార్గవి అన్నారు. ఎస్వీ ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఎస్వీ బాలమందిరం విద్యార్థులకు స్వర్ణప్రాశన ఔషధం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ వేల సంవత్సరాల క్రితమే మన పూర్వీకులు కాశ్యప సంహిత గ్రంథంలో స్వర్ణప్రాశన గురించి తెలియజేశార న్నారు. ఇందులో 6 నెలల నుంచి 16 ఏళ్లలోపు పిల్లలు ఈ ఔషధాన్ని తీసుకోవచ్చని చెప్పారు. ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీ ఆధ్వర్యంలో త్వరలో 357 ఔషధాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. స్వర్ణప్రాశన ఔషధం ఉత్పత్తికి సహకరించిన డాబర్ ఇండియా లిమిటెడ్ వారికి జేఈవో కృతజ్ఞతలు తెలిపారు. టీటీడీ పిఆర్వో రవి మాట్లాడుతూ టీటీడీ విద్యా సంస్థల విద్యార్థులందరికీ ఈ ఔషధాన్ని అందించాలన్నారు. టీటీడీ నిర్వహణలో ఉన్న స్విమ్స్, బర్డ్ ఆసుపత్రుల వలె ఎస్వీ ఆయుర్వేద ఆసుపత్రి కూడా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. జేఈవో ఆధ్వర్యంలో టీటీడీ విద్య, వైద్య రంగాలకు స్వర్ణ యుగమని వివరించారు. ఈ కార్యక్రమంలో డాబర్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధి ముబారక్, ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ, ఆయుర్వేద ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేణుదీక్షిత్, బాల మందిరం ఏఈవో అమ్ములు, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో బీసీవై పార్టీ కీలకం
బీసీవై వ్యవస్థాపకులు రామచంద్ర యాదవ్

విశాలాంధ్ర-ఐరాల: స్వయంభు వరసిద్ధి వినాయక స్వామిని ఆదివారం బీసీవై పార్టీ వ్యవస్థాపకులు రామచంద్ర యాదవ్ దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, వినాయక స్వామిని కోరుకున్నట్లు తెలిపారు. చిత్తూరు జిల్లాలో సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు ఆహ్వానం మేరకు వారిని కలిశానని, సీకే బాబు తో పాటు వారి కుటుంబ సభ్యులందరూ బీసీవై పార్టీతో కలిసి పని చేస్తారని ఆశిస్తున్నాను అని అన్నారు. కచ్చితంగా రానున్న ఎన్నికల్లో టిడిపి, వైసిపి ల కన్నా ఈ సి వై పార్టీ బలంగా బలపడుతుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే మొదటి ఉద్దేశమని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా ప్రజలకు అన్యాయం జరిగితే బీసీ వై పార్టీ అండగా ఉండి పోరాడుతుందని అన్నారు.

టిడిపి నాయకులు సామూహిక నిరాహార దీక్ష

విశాలాంధ్ర- పలమనేరు : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా పలమనేరు తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద సామూహిక నిరాహార దీక్ష చేపట్టిన పలమనేరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు ఈ సందర్భంగా నాయకులు, మాజీ ఏఎంసి చైర్మన్ రామచంద్ర నాయుడు, సీనియర్ నాయకులు ఆర్. వి. బాలాజీ, పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ, ఆర్. బి.సి కుట్టి, సోమశేఖర గౌడు,నాగరాజు రెడ్డి, మరియు ప్రధాన కార్యదర్శులు గిరిబాబు, ప్రతాప్ రెడ్డి,గణేష్, సుబ్రహ్మణ్యం శెట్టి,ముఖ్య నాయకులు సుబ్రహ్మణ్యం గౌడు, చౌడప్ప,ఖాజాపీర్, గ్యాస్ నాగరాజు,సుబ్రహ్మణ్యం గౌడు,తెలుగు యువత నాయకులు ధీరజ్, గిరిధర్ గోపాల్, మరియు మహిళా నాయకురాళ్లు శివకుమారి, వరలక్ష్మి, ప్రమీల,పర్వీన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మాట్లాడిన నాయకులు వైకాపా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

80మందికి ఉచిత కంటి పరీక్షలు

విశాలాంధ్ర -బైరెడ్డిపల్లి: మండల కేంద్రం లోని బైరెడ్డిపల్లె జడ్ పి హైస్కూల్ నందు చెన్నై శంకర్ నేత్రాలయ మరియుమిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి చికిత్స శిభిరం జరపడమైనది.ఈ చికిత్సా శిభిరం నకు మండలం లోని ప్రజలు 80మంది హాజరయినారు.కంటి శస్త్ర చికిత్స నకు 36 మంది ఎంపికయినారు వారికి ప్రఖ్యాతి గాంచిన చెన్నై శంకర నేత్రాలయ హాస్పిటల్ నందుఉచిత కంటి శస్త చికిత్సలు చేయడం జరుగుతుంది.వీరందరికి ఉచిత ప్రయాణం ,బోజనం, వసతి, మందులు అందజేయడం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో శంకర నేత్రాలయడా,మురళి క్రిష్ణ, శ్రీనివాసులు,చంద్ర,చిన్నప్ప,శివయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ లు పట్టివేత

విశాలాంధ్ర-వెదురుకుప్పం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై రమేష్ బాబు ఆదివారం చెప్పారు.వివరాలలోకి వెళితే ..రామచంద్రాపురం మండల పరిధిలో ని స్వర్ణముఖి నది నుంచి ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా వెదురుకుప్పం వైపుకు ట్రాక్టర్ ల ద్వారా ఇసుక తరలిస్తుండగా కార్తిక్,దేవకుమార్ లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో కేసు నమోదు చేశామన్నారు.ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ రవాణాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిరసన దీక్ష చేస్తున్న తెలుగు తమ్ముళ్లు

విశాలాంధ్ర-కార్వేటినగరం : మండలం నుండి పాలసముద్రం మండలంలో జిడి నెల్లూరు టిడిపి ఇన్చార్జ్ డాక్టర్ థామస్, రాష్ట్ర ప్రభావశీలులు గుర్తింపు సభ్యులు భీమినేని చిట్టిబాబు నాయుడు ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు అక్రమ అరుస్తున్న ఖండిస్తూ ఆదివారం మండలం నుండి మాజీ ప్రధాన కార్యదర్శి హేమంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ అన్నామలై, వాల్మీకి మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సందని తదితరులు సంఘీభావం తెలిపారు. అదేవిధంగా మండల పార్టీ అధ్యక్షులు చెంగల్రాయల్ యాదవ్‌ను ఇంటి వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు.

వైభవంగా పవిత్రోత్సవాలకు అంకురార్పణ

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసి ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి. ఆలయంలో నిర్వహించే పవిత్రోత్సవాలకు ఆదివారం అంగరంగ వైభవంగా అంకుర్పాణ కార్యక్రమాలు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా స్వామివారిని వేకువ జామున సుప్రభాతసేవతో మేల్కొలి నిత్యంకైం కర్యాలను నిర్వహించారు. ఉభయ దేవేరులతోపాటు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు సర్వదర్శనం. భాగ్యం కల్పించారు. ఉదయం 9 గంటలకు ఆచార్య ఋత్విక్వరణం నిర్వహించారు. సాయంత్రం అంకురార్పణకు ముందు పవిత్రమైన పుట్టమట్టితో మేదినీ దేవిని ప్రతిష్టించి అమ్మవారికి పట్టువస్త్ర సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించి వేద పండితులు వేద మంత్రాల నడుమ అత్యంత వైభవంగా హూజలు, పుణ్యహవచన చేపట్టారు. అనంతరం సాయంత్రం 4.50 నుంచి సేనాధిపతి ఉత్సవ సమర్పణ జరిగింది.అనంతరం రాత్రి 6 గంటల నుంచి 8.30 వరకు మృత్సంగ్రహణం, అంకురార్పణ, యాగశాల, వైదిక కార్యక్రమాలు చేపట్టి విశ్వకేశుని సేనాధిపతి ఉత్సవరులను ప్రత్యేక వాహనంలో ప్రతిష్ఠించి తిరువీధి ఉత్సవం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కర్పూర హారతులు పట్టి మొక్కలు తెచ్చుకున్నారు. రాత్రి 8.30 గంటలకు ఏకాంత సేవలో పవలింప చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నాగరత్న,సూపర్డెంట్ రమేష్ కుమార్, అధికారి సురేష్ కుమార్ వేదపండితులు దాసరి, గోపాల స్వామి, పలువురు ఉన్నారు. పవిత్రోత్సవాల సందర్భంగా శ్రీకోదండరామస్వామి వారికి ఏకాంత తిరుమంజనం జరుగుతుందని, యాగశాల అనంతరం మధ్యాహ్నం 11.30 నుండి 12 వరకు రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం, నిర్వహించ నున్నట్లు ఆలయ అధికారి సురేష్ కుమార్ అన్నారు. అలాగే 12 గంట నుండి 1 గంటల వరకు పవిత్ర సమర్పణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం నాలుగు గంటల నుండి 6 గంటల వరకు స్వామివారికి తిరువీధి ఉత్సవం చేపట్టి ఆరు నుండి ఎనిమిద గంటల వరకు యాగశాల, పూర్ణహుతి వంటి వైదిక కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. రాత్రి 9.30 గంటలకు ఏకాంత సేవతో పవిత్రోత్సవాలు ముగయ నున్నట్లు వారన్నారు.

విశాలాంధ్ర
తిరుపతి జిల్లా

కేంద్రం అండతోనే జగన్ అరాచకాలు

తిరుపతిలో మీడియాతో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: సీఎం జగన్ రెడ్డి రాష్ట్రంలో అన్ని విధాలా అరాచకాలకు పాల్పడడానికి కేంద్రంలోని పెద్దల అండదండలు మెండుగా ఉండడమే ప్రధాన కారణం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అభిప్రాయపడ్డారు. ఆదివారం ఆయన తిరుపతిలో మీడియాతో మాట్లాడారు. కేంద్ర పెద్దల అండదండలు, సహకారం లేనిదే జగన్ రెడ్డి తన తమ్ముడు అవినాష్ రెడ్డి అరెస్టు విషయంలో ఏకంగా కేంద్ర ప్రభుత్వ విచారణ సంస్థలను నిలువరించే పరిస్థితి లేదన్నారు. అలాగే కేంద్రాన్ని డిమాండ్ చేసి సాధించాల్సిన ప్రత్యేక హెూదా, పోలవరానికి సమృద్ధి నిధులు, వెనుకబడిన ప్రాంతాల ప్యాకేజీ, పరిశ్రమల స్థాపన లాంటి వాటిని ప్రస్తావిస్తే ఎక్కడ జైలుకు మళ్లీ పంపుతారో అని భయంతో పాలన సాగిస్తున్న సీఎం జగన్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. కేంద్రంలో కొందరు పెద్దలు నిత్యం అవినీతికి వ్యతిరేకంగా పోరాటం అంటూనే జగన్ రెడ్డి లాంటి ఆర్థిక నేరగాళ్లకు అండగా ఉండి విభజించు.... పాలించు.... ధోరణి అవలంబిస్తూ ఉన్నారని రామకృష్ణ ఆరోపించారు. దీన్ని మొత్తాన్ని యావత్ దేశ ప్రజలు గమనిస్తూ సమయం కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు.

వాకాడు టిడిపిలో పార్టీలో కొరవడిన ఐక్యత

నోటి దురుసు వ్యక్తిగా బిరుదు - ఆ వ్యక్తి ప్రవర్తనతో చిన్నాభిన్నం అవుతున్న టిడిపి పార్టీ
సొంత పంచాయతీలోనే తీవ్ర వ్యతిరేకత - సొంత టిడిపి పార్టీ నేతలే మండల అధ్యక్షుడుకు పలు మార్లు ఫిర్యాదు

విశాలాంధ్ర- వాకాడు: మండలంలో తెలుగుదేశం పార్టీ రోజు రోజుకి బలం పుంజుకుంటున్న తరుణంలో అదే పార్టీలో ఒక నాయకుడు సొంత పార్టీ నేతలు కార్యకర్తల పైనే నోటి దురుసు ప్రవర్తనతో వివాదాస్పదంగా మారడం నేతల్లో తీవ్ర అసంతృప్తి రగులుస్తోంది. తనకు అడ్డు చెప్పిన వారిని భూత పురాణంతో తిట్ల దండకాన్ని అవలంబిస్తూ అలజడి సృష్టించడంతో పార్టీలో చీలికలు ఏర్పడుతున్నాయి.గతం నుంచి వాకాడు మండల అధ్యక్షుడిగా దువ్వూరు మధుసూదన్ రెడ్డి కొనసాగుతూ నేటికీ తన ఆశయాలను,పార్టీ సిద్ధాంతాలను ప్రజల ముందుకు తీసుకొని వెళుతూ,ప్రజలకు చేరువవుతున్న తరుణంలో పార్టీ అన్ని విధాల బలపడుతున్న నేపథ్యంలో పార్టీలోని వివాదాస్పద నేతగా కొనసాగుతున్న వ్యక్తి,నాకు పార్లమెంటు స్థాయిలో పెద్ద నాయకులు తెలుసు అంటూ అందరికీ కళ్ళ,బొల్లి మాటలు చెబుతూ,పార్టీ పరంగా పదవులు పంపకాలలో తానే అది నాయకుడిని అంటూ విర్రవిగుతున్నారు.మొదటి నుండి పార్టీని నమ్ముకుని అన్ని విధాల పార్టీకి సహాయ సహకారాలు అందించిన నిజమైన కార్యకర్తలను పక్కన పెడుతూ తీర ప్రాంతాలకు నేనే టిడిపికి దిక్కుముక్కు అంటూ ఆర్భాటాలు చెబుతున్న ఒక నాయకుడి వలన సొంత పంచాయతీలోని టిడిపి నేతలే అతనితో కలసి పనిచేయడం ససేమేరా అంటూ పార్టీ మండల అధ్యక్షుడు కి ఫిర్యాదు చేసిన సంఘటన జరిగిందంటే ఆయన పనితీరు ఏ పాటిదో అర్థమవుతుంది.టిడిపి గూడూరు నియోజకవర్గ ఇన్చార్జి పాశం సునీల్ కుమార్ పుట్టినరోజు వేడుకల్లో కూడా వాకాడు నడిబొడ్డు అయిన అశోక పిల్లర్ సెంటర్ వద్ద,అదే పార్టీకి చెందిన ఓ నేతను అందరూ చూస్తుండగానే వినరాని బూతు మాటలతో అగౌరపరిచిన సంఘటన కూడా ఇతనికే దక్కుతుంది,అంతేకాదు మండల అధ్యక్షుడికి తెలియకుండా పార్టీలో కొంతమంది నేతలకు ఫోన్ చేసి బెదిరించడంతో మన స్థాపన చెందిన ఓ యువ నాయకుడు యువగళం పాదయాత్రలో మండల పార్టీకి సంబంధం లేకుండా సొంతంగానే ఫ్లెక్సీలు కట్టిన వుదంతం కూడా ఇతని నిర్వాకం వల్లే జరిగిందని తెలుస్తోంది. అంతేకాదు తాను టిడిపి నేతనని భార్యా,భర్తల మధ్య వివాదాల గొడవల నేపథ్యంలో కూడా పోలీస్ స్టేషన్లో దబాయింపు చర్యలతో భార్యాభర్తల మధ్య దూరాన్ని పెంచే కార్యక్రమాలకు కూడా పాల్పడటం ఆయనకు సొంతం.మండలంలో ఇతని చర్యల వల్ల పార్టీ క్యాడర్‌లో అసంతృప్తి జ్వాలాలు రగులుతున్నాయని చెబుతున్నారు. ఇకనైనా పార్టీ అధిష్టానం ఇతని ఉదాంతాలపై దృష్టి పెట్టి తగు చర్యలు చేపట్టకపోతే మండలంలో పార్టీ నేతలలో మరింత అసంతృప్తి రగిలే అవకాశం ఉంది.దీని ప్రభావం రేపు రాబోవు ఎన్నికలలో పార్టీ గెలుపు పై కూడా పడే అవకాశాలు మెండుగా ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇస్రో అంతరిక్ష కేంద్రంలో పూర్వ విద్యార్థికి ఘన సన్మానం

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఎక్జిక్యూటివ్ కమిటీ సభ్యులు శ్రీనివాసులుకి ఆత్మీయ వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ,ఈ కార్యక్రమంను ఆత్మీయ అతిథులుగా ఆర్ఐ ఓ ఆదూరి శ్రీనివాసులు, స్కూల్ శ్రీనివాసులు, అధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్య క్రమం లో పూర్వ విద్యార్థుల సంఘం తరఫున అనిల్ రెడ్డి, ఉమ, ఆర్ ఎం భాస్కర్ బాబు ,సురేష్,ఆది నారాయణ రెడ్డి, కుమార్,గురు, సాయిరాం, ధనంజయ రెడ్డి, రాజేంద్ర,ఉస్మాన్ బాషా, షార్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. శ్రీనివాసులుని ఘనంగా సత్కరించి మెమెంటో అందించారు,వారి సేవలను కమిటీ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. స్కూల్ అభివృద్ధికి మరింత మేలు చేయాలని ఆశిస్తూ ఉన్నానని వారు తెలిపారు.

నాయుడుపేటలో టిడిపి నేతల నిరసన

విశాలాంధ్ర-నాయుడుపేట: జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు,మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేయడంపై నాయుడుపేట మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి అధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు.చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేసిన నేపథ్యంలో శనివారం ఉదయం నుంచి నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి సారథ్యంలో పోలీసులు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులను గృహ నిర్బంధం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం పట్టణంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎలాంటి నిరసన కార్యక్రమాలు చేపట్టకుండా ప్రధాన కూడళ్ళలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీనితో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు నాయుడుపేట మాజీ ఏఎంసి చైర్మన్ ఎస్ విజయభాస్కర్ రెడ్డి పట్టణంలోని బిఎంఆర్ నగర్ లో తన నివాసం వద్ద స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.త్వరలో వైసిపి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుంటుం దన్నారు.ఆయన వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు ఉగ్గుమూడి భాస్కర్ రెడ్డి, గూడూరు సుధీర్ రెడ్డి,శ్రీపతి బాబు, మైలారి రాజశేఖర్,జి వి ఆర్ నాయుడు,దండు మధుసూదన్ రెడ్డి, మొండెం బాబు, పాజర్ల లోకనాథం, గాలి రమేష్ నాయుడు, కావేరి పాకం దుర్గాప్రసాద్ ,నాగరాజు తదితరులు ఉన్నారు.

రేపు శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

విశాలాంధ్ర - తిరుమల : తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో సెప్టెంబరు 18 నుండి 26వ తేదీ వరకు జరగనున్న సాలకట్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సెప్టెంబరు 12వ తేదీ మంగళవారంనాడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది.సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సెప్టెంబరు 12న ఉదయం 6 నుండి 11 గంటల వరకు ఈ ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఆలయంలోని ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రంగా కడుగుతారు. ఈ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పుతారు. శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటల తరువాత భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.ఈ కారణంగా మంగళవారం నిర్వహించే అష్టదళపాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది.

బీఎఫ్‌ఏ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర - గూడూరు : బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గూడూరు రూరల్ సీఐ దశరథ రామయ్య కుమారుని జన్మదిన వేడుకలలో భాగంగా ఆదివారం నెల్లటూరు గిరిజన వాడలో 100 మంది పేదలకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ దశరథరామారావు మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత స్థానానికి ఎదుగుతారన్నారు. నలుగురికి సహాయం చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఇంత మంచి కార్యక్రమాలు చేస్తున్న బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ కి కృతజ్ఞతలు తెలిపారు. తన కుమారుని జన్మదిన వేడుకలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. దాతల సహకారంతో త్వరలోనే ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అనంతరం గిరిజనులకు సీఐ చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అశోక్, మల్లి, సాయి, కానిస్టేబుల్స్, సుబ్రహ్మణ్యం, చంద్ర పాల్గొన్నారు.

చట్టానికి ఎవ్వరూ అతీతులుకారని

చంద్రబాబుకి కోర్టు విధించిన రిమాండ్ రుజువుచేసింది

విశాలాంధ్ర -తిరుపతి రూరల్: వందలకోట్ల రూపాయల స్కిల్ స్కాం కేసులో మంగళగిరి సిఐడి పోలీసులు శనివారం అరెస్టు చేసి చంద్రబాబు నాయుడిని విజయవాడ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి 14 రోజులపాటు ఆయనను జ్యుడిషియల్ రిమాండ్లో ఉంచాల్సిందిగా ఆదేశాలివ్వడంతో చట్టానికి ఎవ్వరూ అతీతులుకారని మరోసారి రుజువయ్యిందని తిరుపతి జిల్లా వైయస్సార్సీపీ లీగల్ సెల్ అధ్యక్షులు టి. మునిబాల సుబ్రమణ్యం (దొరబాబు) అన్నారు. సిఐడి పోలీసులు దాకలు చేసిన రిమాండ్ నివేదికలో ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నాయన్న అంశాలను పరిగణలోకి తీసుకున్న తరువాతే ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడికి ఏసీబీ న్యాయస్థానం రిమాండ్ విధించారని దొరబాబు వివరించారు.చట్టం తనపని తాను చేసుకుపోతుందని,నేరానికి పాల్పడ్డ ఎంత పెద్దవారినైనా చట్టం వదిలి పెట్టదని చంద్రబాబు రిమాండ్ విషయంలో స్పష్టమైందని చెప్పారు. చంద్రబాబు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దారి మళ్ళించి నేర కుట్రకు పాల్పడ్డారని దొరబాబు గుర్తుచేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

విశాలాంధ్ర - గూడూరు : ఉపాధ్యాయ వృత్తిలో విశేష కృషి చేసిన పలువురు ఉపాధ్యాయులకు ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆదివారం శ్రీ చైతన్య పాఠశాల ఆవరణంలో విద్యార్థిని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న 8 మంది గురువులను గజమాల, శాలువా, జ్ఞాపికతో సత్కరించి ఘన సన్మానం నిర్వహించారు. సన్మాన గ్రహీతలను ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రోహిణి జనార్దన్ రెడ్డి దంపతుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ స్నేహలత రెడ్డి, ప్రెసిడెంట్ విష్ణు వందన, సెక్రెటరీ శశిరేఖ, ఆంధ్ర మహిళా మండలి ప్రెసిడెంట్ జమున, ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, వాకాటి రామ్మోహన్ రావు, ఐటిఐ ప్రభాకర్, ప్రజేంద్ర రెడ్డి, గ్రానైట్ ప్రభాకర్, ప్రభాకర్, కుమార్ నాయుడు, వాకాటి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు అరెస్టు చేయడం దేశానికే తలవంపు
-మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును అరెస్టు చేయడం భారత దేశానికే తలవంపు అని శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు ఎస్సీవీనాయుడు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ రెండవ రోజైన ఆదివారం శ్రీకాళహస్తిలో ఎస్సీవీనాయుడు నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో జి20 సదస్సు జరుగుతున్న తరుణంలో ప్రపంచ విజన్ ఉన్న నాయకుడిని అక్రమ కేసుల్లో అరెస్టు చేయడం దేశానికే చెడ్డపేరు అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ చంద్రబాబు నాయుడుని విడుదల చేయాలని డిమాండు చేశారు. పాలకుడు కక్ష సాధింపు దిశగా వ్యవహరిస్తే అది రాక్షస పాలన అవుతుందన్నారు. రాష్ట్రానికి బిల్ క్లింటన్ వంటి ప్రముఖులను రప్పించి ఐటీ రంగంలో మేటి గా తీర్చిదిద్దిన చంద్రబాబు నాయుడును అక్రమ కేసుల్లో ఇరికించి కక్ష సాధింపు చర్యల్లో భాగంగా వేధించడం అత్యంత దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్ర వాడ ప్రవీణ్ కుమార్, ఎస్సీవీ దిలీప్, భాస్కర్ నాయుడు,, నారాయణ యాదవ్, ఎస్సీవీ కిరణ్, పూల ఆనంద్, రాఘవరెడ్డి, సర్పంచ్ బాలాజీ, మాజీ సర్పంచ్ హరి నాయుడు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణ సమీపంలోని గాంధీ నగర్ లో ఆదివారం నూతనంగా నిర్మించిన విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అర్చకులు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన విగ్రహాలకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పూజా కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఎద్దల నరేందర్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

టీడీపీ నేతలు అక్రమ అరెస్టు

విశాలాంధ్ర-తొట్టంబేడు: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ నిరాహార దీక్ష చేయడానికి సిద్ధమవుతున్న తొట్టంబేడు మండలం టీడీపీ నేతలను ఆదివారం పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, తొట్టంబేడు మండల అధ్యక్షులు గాలి మురళీనాయుడు, పాల సరఫరా సంఘం మాజీ అధ్యక్షులు రావిళ్ల మునిరాజా నాయుడుతో పాటు సుమారు 20మందిని పోలీసులు అరెస్టు చేశారు. నిరాహార దీక్ష చేయకూడదని టీడీపీ నేతలకు పోలీసులు నిబంధన విధించారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో లెక్కల మురళి నాయుడు, తొట్టంబేడు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు నెలబల్లి సునీల్, మాజీ ఎంపీటీసీ సింగమాల భాస్కర్, కన్నలి రత్నయ్య, ఘట్టమనేని శంకర్ నాయుడు, బీసీ సెల్ నాయకులు భాస్కర్, బాలసుబ్రమణ్యం, డి.కిరణ్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్ నాయుడు, రాంబట్లపల్లి భాస్కర్ నాయుడు, మాజీ ఎంపీటీసీ విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ చలపతి, శేషమనాయుడు, శంకర్ నాయుడు, తొండు వీర రాఘవులు, పూడి ప్రభాకర్, సాలి రాజా, గంధం శ్రీనివాసులు, శంకర్, చెంచయ్య, పెంచలయ్య, అనంత బాల్ నాయుడు, సుబ్రహ్మణ్యం, బాలిశెట్టి మోహన్, మాజీ జడ్పీటీసీ సుబ్బరామయ్య, రామచంద్ర నాయుడు, సుధాకర్ నాయుడు, కరీముల్లా, భాషా తదితరులు ఉన్నారు.

జనసేన నేతలు అరెస్టు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి వినుత కోటాతో పాటు ఆమె కోట చంద్రబాబు, ఆ పార్టీ నేతలను ఆదివారం శ్రీకాళహస్తి పోలీసులు అరెస్టు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు వారిని పోలీసు స్టేషన్ లోనే ఉంచారు. తమను ఎందుకు అరెస్టు చేశారో చెప్పాలని జనసేన నేతలు డిమాండు చేసినా పోలీసుల నుంచి సరైన సమాధానం రాలేదు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినందున అరెస్టు చేశామని... వారు చెబితేనే విడుదల చేస్తామని పోలీసులు చెప్పడం విడ్డూరంగా ఉందని జనసేన నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన నియోజకవర్గం ఇన్ ఛార్జి వినుత కోటా మహిళ అయినా ఆమెను రాత్రి 7గంటలు దాటినా పోలీసు స్టేషన్ లోనే నిర్బంధించడం విమర్శలకు దారితీసింది. వైసీపీ పాలనలో పోలీసులు ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారని వారు జనసేన పార్టీ నేతలు ఆరోపించారు.

ఎస్వీయూ స్టాటిస్టిక్స్ విభాగంలో ధర్మనిధి ఉపన్యాసం

విశాలాంధ్ర-తిరుపతి: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం , గణాంకశాస్త్ర విభాగంలో పద్మవిభూషణ్ డా. సి. ఆర్. రావు గారిచే స్థాపించబడిన " సి డి నాయుడు ఆర్కాట్ లక్ష్మీకాంతం" ధర్మనిధి ఉపన్యాసాన్ని ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య కె . రాజారెడ్డి దీప ప్రజ్వలన చేసి ప్రారంభించారు.పద్మవిభూషణ్ డా. సి.ఆర్. రావు గొప్పదనం గురించి పరిచయం చేశారు. ఈ ఉపన్యాసానికి వక్తగా ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్ స్టిట్యూట్ ,చెన్నై, మాథమాటికల్ ఇనిస్టిట్యూట్‌లలో పనిచేసిన డా.బి వి రావు ప్రసంగించారు. కైనటిక్ ఎనర్జీ సిద్ధాంతాన్ని గణాంకశాస్త్రంలో ఉత్తమ ఫలితాలు రాబట్టడానికి ప్రయోగాత్మకంగా ఉపయోగించే పద్ధతులను వివరించారు.ఈ సమావేశంలో ప్రముఖుల సమక్షంలో "తిరుపతి ఇంటర్నేషనల్ స్టాటిస్టిక్స్ అసోసియేషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్వీయూ పక్షాన గణాంకశాస్త్ర విభాగాధిపతి డా. సరోజమ్మ నిర్వహించారు. సభలో ఆచార్య సుబ్రహ్మణ్యం, ఆచార్య బాలసిద్ధముని, ఆచార్య వెంకట్రామయ్య,డా.హరి మల్లికార్జున రెడ్డి, డా. వెంకట రమణారెడ్డి, డా.మణి పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతిలో సాగుతున్న నృత్యోత్సవాలు

నేటితో ముగుస్తాయన్న రంగస్థలి చైర్మన్ గోపీనాథ్ రెడ్డి

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: తిరుపతి మహతి ఆడిటోరియంలో 33వ శ్రీకృష్ణదేవరాయ వార్షిక సంగీత, సాహిత్య నృత్యోత్సవాలు రెండోరోజు ఆదివారం కూడా కొనసాగాయి. రాయలసీమ రంగస్థలి చైర్మన్ గూండాల గోపీనాథ్ రెడ్డి, పలువురు కళాకారులు విచ్చేసి శనివారం ప్రారంభించిన ఈ నృత్యోత్సవాలు సోమవారం ముగుస్తాయని గుండాల గోపీనాథ్ రెడ్డి తెలిపారు. మూడు రోజుల పాటు ఉభయ రాష్ట్రాల నుంచి వచ్చిన, కళాకారులతో ఉదయం 10 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు నృత్య పోటీలు జరుగుతాయన్నారు. ఇందులో హాజరైన ప్రతి కళాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.అలాగే ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్ తో పాటు జ్ఞాపికలు, నగదు బహుమానం అందజేస్తామన్నారు. 11వ తేదీ(నేడు) సాయంత్రం ముగింపు వేడుకల్లో విజేతలకు పురస్కారాలు అందజేస్తామన్నారు. నగర ప్రజలు, కళా ప్రియులు ఈ పోటీలను తిలకించి, కళాకారులను ప్రోత్సహించాలని గుండాల గోపీనాథ్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో కె.ఎస్. రాజా, ఎస్వీ వెంకటేశు, టి.సుబ్రహ్మణ్య రెడ్డి, కే.కేశవరెడ్డి, చంద్రబాబు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర చికిత్స శిబిరం

విశాలాంధ్ర-నాయుడుపేట: నాయుడపేట పట్టణంలోని వేమా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఆవరణలో ఆదివారం కోటపోలూరు గ్రామ కోగిలి జయరామి రెడ్డి సేవా సంస్థ సహకారంతో నాయుడుపేట టౌన్ రోటరీ క్లబ్ ఉచిత నేత్ర చికిత్సా శిబిరం ఏర్పాటు చేశారు.తిరుపతి ఎస్. వి. అరవింద్ హాస్పిటల్ కు చెందిన కంటి వైద్యులు సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, 25 మందికి ఆపరేషన్లు అవసరం అని నిర్ధారించారు.వారికి తిరుపతి అరవింద్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని డాక్టర్ గౌరి శంకర్ తెలియజేశారు. ఈ కార్యమం లో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్. గోపినాథ్, కార్యదర్శి.ఎన్ రామమోహన్, జయరాజ్ గోపాల్, సోమశేఖర్,స్వరాజ్ కుమార్,రామ చంద్రా రెడ్డి, బట్టా సుబ్రమణ్యం, ఉదయ్ శంకర్, లక్ష్మీ నారాయణ, హరిబాబు,శేషు బాబు, డాక్టర్‌లు వి. భానుప్రదీప్, వి.శ్రీధర్ రెడ్డి, కె జె ఆర్ చారిటుల్ ట్రస్ట్ అధినేత సురేశ్ రెడ్డి, కృష్ణా రెడ్డి,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శశి గణేశ స్కానింగ్ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన శశి గణేశ స్కాన్స్ అండ్ డయోగ్నోస్టిక్స్ సెంటర్ ను ఆదివారం ఉదయం తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష యాదవ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మెడికల్ హబ్ గా అభివృద్ధి చెందుతున్న తిరుపతి నగరంలో ఇలాంటి వైద్య పరీక్షల కేంద్రాలు మరిన్ని ఏర్పాటై ప్రజలకు చౌకగా సేవలు అందివ్వాలని పిలుపునిచ్చారు.

గూడూరులో గుర్తు తెలియని మృతదేహం

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని కరణాల వీధి బొడ్డుచౌక్ లో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఒకటవ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ హజరత్ బాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతిచెందిన వృద్ధునికి సుమారు 60 ఏళ్లు ఉంటుందన్నారు. మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

దోచుకునోళ్లకు దండాలు -నిజాయితీ పరులకు అరదండాలా: మాజీ ఎమ్మెల్యే పాశం

విశాలాంధ్ర - గూడూరు : సిలికా, మద్యంతో వైసీపీ నాయకులు వేల కోట్ల రూపాయలు దోచుకుతింటున్నారని ప్రభుత్వం వీళ్ళను ప్రోత్సహిస్తూ అవినీతి మచ్చలేని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై రాజకీయ కక్షతో అరెస్టు చేయించారని గూడూరు నియోజకవర్గ టిడిపి మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ ఆదివారం గూడూరు పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ స్వగృహంలో శనివారం రాత్రి కాగడాలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఆదివారం రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ కక్షతోనే ఎటువంటి అవినీతి లేకపోయినా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. సిలికా, మద్యంతో వేల కోట్ల రూపాయలు వైసిపి నాయకులు దోచుకు తింటున్నారన్నారు. శాంతియుతంగా నిరసన దీక్షలకు వస్తున్న టీడీపీ నాయకులను పోలీసులు ఎక్కడికి అక్కడ అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. రాజ్యాంగ బద్ధంగా ప్రతి ఒక్కరికి తమ నిరసన తెలిపే హక్కు ఉందన్నారు. కొంతమంది పోలీసులు అత్యుత్సాహం చూపిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని వెల్లడించారు. ఈ దీక్షా కార్యక్రమంలో నాయకులు వాటంబేటి శివకుమార్, లీలావతి, భారతి, పెంచలయ్య, జహంగీర్, పల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు